## క్లుప్తంగా

### ఘనంగా వీరభద్రుని సంబరం



సామూహిక పూజలు చేస్తున్న కాలనీ వాసులు

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరం రైల్వే కాలనీ వద్ద సోమవారం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి సంబరాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి వీరభద్రస్వామిని బ్యాండ్‌మేళాలు, బాణసంచాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద నిప్పులగుండం పెట్టి భక్తులు తొక్కారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో సంబరంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### ఎలక్ట్రికల్ ఏఈకు సత్కారం



ఏఈ వెంకటరమణను సత్కరిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్‌వర్మ తదితరులు

రామచంద్రపురం: పట్టణ విద్యుత్ శాఖ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ రిపబ్లిక్ డేకు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా సోమవారం డీఈ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్‌వర్మ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. వెంకటరమణకు దుశ్శాలువ వేసి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో డీఈఈ కె. మురళీమోహన్, ఈఆర్‌ఓ ఏఏఓ వాసిరెడ్డి శ్రీనివాసరావు, ఏడీఈ పి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు నూతన రథానికి సంప్రోక్షణ

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి కల్యాణం కోసం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో సిద్ధమైన నూతన రథానికి నేటి ఉదయం 11.54 గంటలకు మంత్రి వేణు చేతుల మీదుగా సంప్రోక్షణ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ తారకేశ్వరరావు సోమవారం విలేకరులకు తెలిపారు. అదే విధంగా బుధవారం తెల్లవారుజామున 5.25 గంటలకు పూర్ణాహుతి నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

### క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 21 మంది ఎంపిక

రామచంద్రపురం: పట్టణంలోని వీఎస్‌ఎం అటానమస్ కళాశాలలో సోమవారం హెక్జావేర్ ఇంటర్నేషనల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 221 మంది ఎంపికయినట్లు ప్రిన్సిపల్ ఎస్ఎన్ అలీఅన్సారీ తెలిపారు. డిగ్రీ మూడో సంవత్సరం అన్ని బ్రాంచిల నుంచి 176 మంది ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారన్నారు. ఎంపికైన విద్యార్థులు చెన్నై కేంద్రంగా పనిచేయాల్సి ఉందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి, టీపీఓ రవీంద్ర, డిగ్రీ కోఆర్డినేటర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

మండపేట: జగనన్న విద్యాకానుకలో భాగంగా మండలంలోని కేశవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు విద్యాభారతి స్టడీమెటీరియల్‌ను సోమవారం ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. అందుకోసం అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని, విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, కూసు అబ్బు, రామారావు పాల్గొన్నారు.

### కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎన్‌ఎస్‌డీ రత్నకుమారి, డాక్టర్, జెఆనూజ ప్రియాంక అన్నారు. పీహెచ్‌సీ వద్ద సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు వ్యాధి లక్షణాలు, చికిత్స, సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. వైద్యులు మాట్లాడుతూ ఫిబ్రవరి 13 వరకూ గ్రామ సచివాలయాల పరిధిలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ పి.సురేష్, సిబ్బంది బి.శ్యామల, ఎస్వీ రామారావు, ఎం.అలీ, దేవి, దివ్య, వెన్నేటి వెంకటేశ్వర్లు, తోటకూర రామకృష్ణ పాల్గొన్నారు.

# వెదజల్లు.. ఇదే మేలు..

- ఏపుగా పెరుగుతున్న వరి చేలు
- ఖర్చు తక్కువ దిగుబడి ఎక్కువ
- 90 శాతానికి పైగా ఈ పద్ధతిలోనే సాగు



కాజులూరు మండలం మొగలిపాలెంలో ఏపుగా పెరిగిన వెదజల్లిన చేను

రామచంద్రపురం: సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకుంటున్నారు. 15 ఏళ్ల క్రితం వ్యవసాయానికి ఇప్పటి వ్యవసాయానికి తేడాలను గమనిస్తూ వ్యవసాయాధికారుల సూచనలతో ముందుకు సాగుతున్నారు. తాజాగా వెదజల్లు పద్ధతిలో చేస్తున్న వరిసాగు విధానంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. గతంలో వెదజల్లు పద్ధతిని రైతులకు తెలియజేసేందుకు వ్యవసాయాధికారులు నానా అవస్థలు పడేవారు. కానీ ఇప్పుడు రైతులు మాత్రం రబీ సాగులో పూర్తిగా వెదజల్లునే ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం వెదజల్లిన చేలు ఏపుగా ఎదగడం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**94 వేల ఎకరాల్లో సాగు**

ఈ ఏడాది రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో రబీలో 94వేల ఎకరాల్లో వరి సాగును రైతులు చేస్తున్నారు. గతంలో అయితే 50 శాతం మాత్రమే వెదజల్లు సాగు చేసేవారు కానీ ఈ సారి రామచంద్రపురం నియోజకవర్గంలో 90 శాతం, మండపేట నియోజకవర్గంలో 75 శాతం వెదజల్లు సాగును రైతులు చేపట్టారు.

**ఖర్చు తక్కువ**

దాళ్వా సాగులో రైతులు వెదజల్లేందుకే మొగ్గు చూపారు. వెదజల్లడం వల్ల కూలీల రేటు కలిసొస్తోందని, మాసూళ్లు కూడా ముందుగా వస్తాయని దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యకం చేస్తున్నారు. విత్తనాల దగ్గర నుంచి ఎరువులు, పురుగు మందులు ఖర్చులు బాగా తగ్గడంతో ఆసక్తి చూపుతున్నారు.

వెదజల్లు సాగు వల్ల నీటి వాడకం కూడా తగ్గించుకోవచ్చని రైతులు చెబుతున్నారు. దాళ్వా సాగులో సాధారణంగా సాగునీరు అందడం కొంచెం కష్టతరమవుతుంది. ఈ పరిస్థితుల్లో వెదజల్లడం వల్ల సాగునీటి కష్టాలు కూడా తప్పుతున్నాయి.

పంట కాల సమయం కూడా తగ్గటం మూలంగా మాసూళ్లలోను రైతులు ముందుగా పూర్తి చేసుకుని మూడో పంటకు కూడా వెళ్లే అవకాశాలుంటున్నాయి. వెదజల్లటం మూలంగా దిగుబడి కూడా పెరుగుతుంది. ఎకరాకు సుమారుగా 45 నుంచి 50 బస్తాల వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. దీంతో సుమారుగా మొత్తంగా రూ.10వేల వరకు రైతులకు ఆదా అవుతుంది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు ఇప్పటికే రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో దాదాపుగా రబీ వరిసాగు నాట్లను పూర్తి చేశారు. ముందుగా వెదజల్లిన వరి చేలు ఇప్పటికే ఏపుగా పెరుగుతున్నాయి. వాతావరణం సానుకూలంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**వెదజల్లుతో ఖర్చు ఆదా**



దాళ్వా సాగులో గత కొన్నేళ్లుగా వెదజల్లునే చేస్తున్నాం. దీని మూలంగా గతం కంటే వెదజల్లటం మూలంగా ఖర్చు తక్కువగాను, దిగుబడి అధికంగా ఉంటుంది. దీంతో మొదటి పంటలో నష్టం వచ్చినా పూడ్చుకునే వీలు కలుగుతుంది. దీంతో రైతులు అందరూ వెదజల్లునే చేస్తున్నారు.

–గుణ్ణం రామకృష్ణ రైతు కొత్తూరు

**తెగుళ్లు తక్కువ**

రబీ సాగులో వెదజల్లడం మూలంగా అధిక శాతం వరికి తెగుళ్లు సోకే వీలుండదు. ఒక వేళ ఏదైనా తెగులు వచ్చినా తట్టుకుని దిగుబడి తగ్గకుండా ఉంటుంది. వెదజల్లడం వల్ల దుబ్బులు అధికంగా ఏర్పడి ధాన్యం దిగుబడి పెరుగుతుంది.

–వి.అశోక్ ఏఓ
కాజులూరు మండలం

## పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట తోట త్రిమూర్తులు
- న్యూకాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం

మండపేట: పేదల అభ్యున్నతి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దోహదం చేస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్సీ తోట, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, పార్టీ రంపచోడవరం నియోజకవర్గ అబ్జర్వర్ వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, పార్టీ రాష్ట్ర నేతలు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు తదితరులతో కలిసి స్థానిక 11వ వార్డు న్యూకాలనీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మమేకమయ్యారు. మూడేళ్ల పాలనలో వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడికక్కడే మున్సిపల్ అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేశారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ సంక్షేమ పథకాల పట్ల ప్రజలు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. కౌన్సిలర్ కొవ్వాడ బేబి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీలు వుండమట్ల శ్రీనివాస్, మేడిశెట్టి సత్యవేణి, పార్టీ అర్బన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, మలసాని సీతామహాలక్ష్మి, శెట్టి కల్యాణి, అమలదాసు లక్ష్మి, నీలం దుర్గ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### 1న శ్రీవాసవి ఫంక్షన్ హాల్ ప్రారంభం

మండపేట: మండలంలోని ఏడిద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవాసవి ఫంక్షన్‌హాలును ఫిబ్రవరి 1వ తేదీన ప్రారంభించనున్నట్టు వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు తెలిపారు. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శివరామసుబ్రహ్మణ్యం, మండపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి నాగబాబు, ఆర్యవైశ్య ప్రముఖులు ప్రారంభ వేడుకకు హాజరవుతారన్నారు. బుధవారం ఉదయం చామర్తి లోవరాజు, నాగగౌరీలక్ష్మి సత్యవతి దంపతులు, నార్కెడిమిల్లి శ్రీనివాస్, సుధారాణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించిప్రారంభోత్సవం చేయనున్నట్టు నాగబాబు సోమవారం తెలిపారు.

### అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల పరిశీలన

కపిలేశ్వరపురం: మండలంలోని వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పథకంలో భాగంగా రూ.79 లక్షలతో ఆధునీకరణ పనులను చేపట్టారు. పనులను సచివాలయ ఏఈ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పిల్లి శ్రీనివాస్ పనులను పర్యవేక్షిస్తున్నారు. పాఠశాలలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఆచంట గంగాధర రామారావు సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ.10.71 లక్షలతో పాఠశాలలో మరుగుదొడ్లు, రూ.37 లక్షలతో పాఠశాలలో మూడు అదనపు తరగతి గదులను, మిగిలిన నిధులతో మేజర్, మైనర్ మరమ్మతు పనులు చేపట్టామన్నారు.

### విశ్వబ్రాహ్మణ సంఘం నేతలకు సత్కారం

మండపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విశ్వబ్రాహ్మణ సంక్షేమానికి సంఘానికి మండపేట నుంచి ఎన్నికైన నేతలను సోమవారం జాతీయ బీసీ సంఘం ఘనంగా సత్కరించింది. పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణులు వి.రాధాకృష్ణప్రసాద్, కె.కృష్ణమాచార్యులు, బి.సత్యనారాయణ, ఒ.పోలరాజు, రామోజీ కృష్ణ, కె.హేమచంద్ర శ్రీనివాస్, దార్ల స్వామికి జిల్లా సంఘంలో పలు పదవులు దక్కాయి. జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ తదితరులు స్థానిక కామాక్షి కల్యాణ మండపంలో వారిని ఘనంగా సత్కరించారు. కౌన్సిలర్ కె.కాశీవిశ్వనాథం, వి.శ్రీనివాసు, ఎం.గణపతి, వి.రామకృష్ణ పాల్గొన్నారు.

### వెల్లలో పొలంబడి



వెల్ల పొలంబడి కార్యక్రమంలో రైతులకు సూచనలు చేస్తున్న ప్లాన్ ప్రొటెక్షన్ ఏడీఏ ఎ.మధులేటి

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్లలో సోమవారం మండల వ్యవసాయ అధికారి ఎస్. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో 4 వ వారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తనిఖీ నిమిత్తం గుంటూరు వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి ప్లాన్ ప్రొటెక్షన్ ఏడీఏ ఎ.మధులేటి, ముమ్మిడివరం జేడీఏ కార్యాలయం ఏడీఏ రాజశేఖర్ విచ్చేశారు. వారు గ్రామ వ్యవసాయ సహాయకులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రైతులను పొలంబడి కార్యక్రమం జరుగుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాయుడు మోహన్, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

## జాతిపితకు ఘన నివాళులు



వెలంపాలెంలో గాంధీ విగ్రహం వద్ద కుష్ఠువ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



అముజూరులో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్ కల్యాణి తదితరులు

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కుందూరు సెంటర్లో స్థానికంగా ఉన్న గాంధీ విగ్రహానికి ఎంపీపీ పంపన నాగమణి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ గాంధీజీ సమాజానికి ఎంతో సేవ చేశారని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. అముజూరు సచివాలయం వద్ద సర్పంచ్ నానాపరపు కళ్యాణి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పామర్రు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మల్లికార్జునుడు, నాయకులు నానాపరపు శ్రీనివాస్, పెంకే రవిచంద్ర, ఏఎన్‌యం శైలజ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**రామచంద్రపురం రూరల్‌లో..**

రామచంద్రపురం రూరల్: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయల వద్ద ఆయా గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కుష్ఠు వ్యాధి నివారణకు ప్రతిజ్ఞలు చేశారు. వెలంపాలెంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో డీఎల్‌డీఓ ఎ.శాంతి, హౌసింగ్ డీఈ కె.మల్లికార్జున్, ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో సోమవారం గాంధీ వర్ధంతి పురస్కరించుకుని ఘన నివాళి అర్పించారు. సీపీఐ కార్యదర్శి పి.రాము, గొర్రెల రాము, ఆర్.గోవిందు, మహ్మద్ గౌస్, వి.కృష్ణమూర్తి, ఏఐటీయూసీ నాయకులు బి.సత్యనారాయణ, ఎ.మాచరరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

**జాతిపిత అడుగుజాడల్లో పయనించాలి**

రాయవరం: మహాత్ముడు చూపిన అహింసా మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని, అదే గాంధీజీకి మనమిచ్చే ఘన నివాళులని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ పిలుపునిచ్చారు. రాయవరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతిపిత వర్ధంతిని ఎంపీడీవో డి.శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో మహాత్ముడి విగ్రహానికి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

**మహాత్ముని అడుగుజాడల్లో నడవాలి**

మండపేట: మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడుచుకోవడం ద్వారా సమాజాభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీఓ ఐ రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఎంపీడీఓ రాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అర్తమూరు సచివాలయంలో గాంధీజీ చిత్రపటానికి సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**మహాత్మునికి ఘన నివాళి**

కపిలేశ్వరపురం: మహాత్మా గాంధీకి సోమవారం మండలంలోని గ్రామాల ప్రజలు ఘన నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో 19 గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## వరికి జింకు ధాతు లోపం



గొల్లపాలెంలో జింకు ధాతులోపం తలెత్తిన వరిపంట

కాజులూరు: మండల గ్రామాల్లోని పలుచోట్ల వరిపంటపై ప్రస్తుతం జింకు ధాతు లోపం తలెత్తడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. మండలంలో మొత్తం 24,500 ఎకరాల సాగుభూమి ఉండగా ఈ ఏడాది రబీలో 19,500 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. మండలంలో ప్రస్తుతం వరి పొలాలు దుబ్బు గట్టిపడే దశ నుంచి పిలకలు తొడిగే దశలో ఉన్నాయి. ప్రస్తుతం అక్కడక్కడా కాండం తొలచు పురుగు, లద్దె పురుగు ఆశించిందని అధిక శాతం పొలాల్లో జింకు ధాతు లోపాలు కనిపిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. జింకు ధాతు లోపం ఏర్పడితే వరి ఆకుసుతలపై తుప్పు రంగు మచ్చలు ఏర్పడుతున్నాయని అవి క్రమేపీ కలిసిపోయి ఆకు అంతా గోధుమ రంగులోకి మారిపోతుందని రైతులు అంటున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి వి.అశోక్‌ను వివరణ అడగ్గా వరి మొక్కకు జింక్ తక్కువపాళ్లలోనే అవసరం అవుతుందని అయినప్పటికీ అది తగ్గితే జింకు ధాతులోపం తలెత్తి పంటకు నష్టం వాటిల్లుతుందన్నారు. వాతావరణంలో చలి ఎక్కువగా ఉన్నప్పుడు వరిపంటపై జింకులోపం ఎక్కువగా కనిపిస్తుందన్నారు. దీంతో పంట ఏ విధమైన పోషకాలను గ్రహించలేదని, మొక్క క్రమేపీ ఎదుగుదల లేక గిడస బారిపోతుందన్నారు. ఈ ఆకును విరిచినప్పుడు లోహపు శబ్దం వినిపిస్తుందన్నారు. జింకు ధాతులోపం నివారణకు జింక్‌సల్ఫేట్ నాలుగు వందల గ్రాముల మందును రెండు వందల లీటర్ల నీటిలో కలిపి మూడు రోజుల వ్యవధిలో ఎకరం పంటపై రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. రైతులు పక్క రైతులను అనుసరిస్తూ అవసరం లేకుండానే ఇష్టమొచ్చిన ఎరువులు, మందులు పంటలపై వినియోగిస్తున్నారని దీనివల్ల అనవసరపు ఖర్చులు అవ్వటమే కాకుండా పంటకు నష్టం జరుగుతుందన్నారు. పంటపై సోకే తెగుళ్లను రైతులు ఎప్పటికప్పుడు గ్రహిస్తూ వ్యవసాయాధికారుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

## ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

కె.గంగవరం: జగనన్న ఇళ్ల కాలనీలలో లబ్ధిదారులు నూతన ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ కొప్పిశెట్టి భాస్కర్ అన్నారు. మండలంలోని అముజూరు సచివాలయం వద్ద సోమవారం లబ్ధిదారులు, వలంటీర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. సర్పంచ్ నానాపరపు కళ్యాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణం చేపట్టని లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక తక్కువ ధరే సిమెంట్‌ను సద్వినియోగం చేసుకుని నిర్మాణం చేపట్టాలన్నారు. దీంతో పాటు లబ్ధిదారులకు కొంత వరకు ఇళ్ల నిర్మాణం చేప్టడానికి సొమ్ములు కూడా అందిస్తుందన్నారు. గ్రామ పెద్దలు నానాపరపు శ్రీనివాస్, పెంకే రవిచంద్ర, మేడిశెట్టి శ్రీనివాస్, గృహనిర్మాణ శాఖ సిబ్బంది వెంకట్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భీమేశ్వరునికి మొదటి దధి నివేదన



భక్తులకు వడ్డిస్తున్న మంత్రి వేణు సతీమణి వరలక్ష్మి

రామచంద్రపురం రూరల్: పంచారామ క్షేత్రం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సూచన మేరకు ఈ ఏడాది భోగి రోజు నుంచి దధి సేవ (పెరుగు నివేదన) ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మంత్రి వేణు భీమేశ్వరునికి రోజూ తొలి దధి నివేదన కోసం 20 లీటర్ల పెరుగును తన ఇంటి నుంచే సోమవారం నుంచి అందించడం ప్రారంభించారు. స్వామికి తొలి నివేదన సమర్పించిన తరువాత ఆ పెరుగునే భక్తులకు ఉచిత భోజనంలో అందించే విధంగా ఏర్పాట్లు చేశారు. మంత్రి వేణు సతీమణి వరలక్ష్మి, కుమారులు నరేన్, ఉమాశంకర్‌లు సోమవారం స్వామికి పెరుగు సమర్పించారు. అనంతరం మంత్రి సతీమణి వరలక్ష్మి భక్తులకు అన్నప్రసాదంలో భీమేశ్వరునికి నివేదన చేసిన పెరుగును స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యం



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: మండపేట పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తూ అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలో 12వ వార్డులో రూ. 1.93 కోట్లుతో నిర్మిస్తున్న ఇందిరాగాంధీ బైపాస్ రోడ్డు పనులను సోమవారం ఎమ్మెల్సీ తోట పరిశీలించారు. పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షించి పూర్తి నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అసత్యప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ రోడ్డును గతంలో తాము తొమ్మిది మీటర్లు వెడల్పు చేసేందుకు ప్రతిపాదనలు చేశామని ఆయన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రస్తుతం నాలుగున్నర మీటర్లు ఉన్న బైపాస్‌రోడ్డును పెరిగిన ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా అవకాశం ఉన్నంత వరకు అదనంగా మరో రెండున్నర మీటర్లు విస్తరించి ఏడు మీటర్లు వెడల్పున రోడ్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడైనా లోపాలు ఉంటే ప్రతిపక్షం ఎత్తిచూపాలే గాని వంకలు పెట్టడం సరికాదన్నారు. త్వరితగతిన నిర్మాణ పనుల పూర్తి చేసి రోడ్డు వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కౌన్సిలర్ మలసాని సీతామహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పార్టీ నాయకులు సిరంగు శ్రీను, నేమాని శ్రీనివాస్, సాధనాల శివ భగవాన్, పులగం శ్రీనివాస్, మలసాని అప్పన్న, శాకా బుజ్జి, సలాది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాలి



కందులపాలెంలో పర్యటిస్తున్న ఆర్డీఓ సింధు సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం రూరల్: జగనన్న భూహక్కు, భూరక్ష పథకం ద్వారా భూహక్కు పత్రాలు పొందిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని రామచంద్రపురం ఆర్డీఓ పి.సింధు సుబ్రమ్మణ్యం సోమవారం సూచించారు. మండలంలోని కందులపాలెం, కావపరం గ్రామాల్లో ఆర్డీఓ సోమవారం పర్యటించారు. సమగ్ర కొలతలతో, పక్కా సరిహద్దులతో భూహక్కు పత్రం జారీ చేశామన్నారు. రాబోయే తరాలు ఎటువంటి భూ తగాదాలు లేకుండా వివాదాలు లేని భూహక్కు కలిగి ఉండాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకున్నారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీఆర్ఓలు రైతులందరూ ఈ–కేవైసీ చేయించుకునేలా చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కపిలేశ్వరపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై కార్యకర్తలు శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి ఆదేశించారు. వల్లూరులోని 24వ అంగన్‌వాడీ కేంద్రాన్ని గజలక్ష్మి సందర్శించారు. చిన్నారుల ఎత్తు, బరువులను రికార్డులతో సరిచూశారు. పౌష్టికాహారం ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆమె వెంట మహిళా పోలీస్ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

## కుంగ్‌ఫూ పోటీల్లో మండపేట విద్యార్థుల ప్రతిభ



అనకాపల్లిలో తైక్వాండో పోటీలలో పాల్గొన్న అంగర విద్యార్థులు

మండపేట: చరణ్ సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సెకెండ్ నేషనల్ లెవెల్ కుంగ్‌ఫూ, కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండపేట న్యూ డ్రాగన్ చైనీస్ కుంగ్‌ఫూ సంస్థ విద్యార్థులు సత్తాచాటారు. పలు విభాగాల్లో తమ విద్యార్థులు మొదటిస్థానం సాధించారని సంస్థ వ్యవస్థాపకుడు పిట్టా రాజుబాబు సోమవారం తెలిపారు. బ్రౌన్ బెల్ట్ విభాగంలో కె.వెంకట తరుణ్ మొదటి స్థానం సాధించగా, బ్రౌన్‌బెల్ట్ కటాస్ విభాగంలో నవ్య వినయ్ లక్ష్మి మొదటి స్థానం, గ్రీన్ బెల్ట్ విభాగంలో అనిత్ మొదటి స్థానం, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో ఎం.సాయి, అభిషేక్ పాల్ మొదటి స్థానం, ఎల్లో బెల్ట్ విభాగంలో వినయ్ రెండో స్థానం కైవసం చేసుకున్నారని రాజుబాబు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాజుబాబు అభినందించారు.

**తైక్వాండో పోటీల్లో అంగర విద్యార్థుల ప్రతిభ**

కపిలేశ్వరపురం: అనకాపల్లిలో సోమవారం నిర్వహించిన తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విద్యార్థులకు శిక్షణనిచ్చిన కుంగ్ ఫూ, కరాటే మాస్టార్ మత్సా దుర్గారావు వివరాలను వెల్లడించారు. అండర్ 37 కేజీల విభాగంలో అంగరకు చెందిన వై.భార్గవ్ ద్వితీయ, 54 కేజీల విభాగంలో కె.త్రినాథ్ తృతీయ, 65 కేజీల విభాగంలో ఐ.ప్రణీత్ ద్వితీయ స్థానంలోనూ నిలిచారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మాస్టర్ దుర్గారావు, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు అభినందించారు.